# పల్లెటూరు

అనగనగా ఒక పట్టణం. ఆ పట్టణం చివర ఓ పేట. ఆ పేటలో మూడు వేపులా మురికికాలువ మందమందంగా ప్రవహిస్తూ, మరోవేపు అక్కడక్కడా పునాదులుతీసిన గొయ్యిలతో అలరారే భూమితో, ద్వీపంలా కనిపిస్తున్న ఓ పెద్ద మేడ. మేడమీద మారుమూలగది ... ఆ గదిలో నలుగురు ప్రాణులు. సుబ్బారావు, భాస్కరరావు, శంకరం, భానుమూర్తు లనబడేవారు. వాలకాన్ని బట్టిచూస్తే కాలేజి విద్యార్థులలా, అందునా, పి. యు. సి. లో చేరిన కొత్తముఖాల్లా కనిపిస్తున్నారు. ఏదో తీవ్రసమస్యను ముందు పరుచుకు కూర్చున్నారల్లేవుంది.

ఇంతకూ ఏమంటార్రా ? సుబ్బారావు గర్జించాడు.

'హంపీ కెడదాం. చిత్రకళా అదీ బావుంటుందని చరిత్రకారులు ఘోష పెడుతున్నారు' శంకరం తేల్చేసాడు.

హుఁ! ఆబండల్లో నాకేకళా కనిపించదు...భాస్కరం నిజం చెప్పాడు.

నీ ఉద్దేశ్యం ఏమిట్రా భానూ? సుబ్బారావు భానుమూర్తివేపు తిరిగాడు. మరునిముషంలో సుబ్బారావు ముఖంలో రంగులు మారటం చూచి మిగతా ఇద్దరూ అటువేపు చూచారు.

తలవంచుకొని దీర్ఘంగా ఏదో తెగరాసి పారేస్తున్నాడు భానుమూర్తి. ఇహలోకంతో సంబంధాలు తెంచుకున్న తాత్వికునిలా వున్నాడు.

ఒరేయ్ భానూ! భానుగా! గాడిదా! ఇలాచూడరా! సుబ్బారావు ఇంగ్లీషుడాన్స చేస్తున్నాడు.

భానుమూర్తి మెల్లిగా తలెత్తాడు. ఎత్తి సన్నగా చిరునవ్వు నవ్వాడు. నవ్వి మళ్ళీ తలదించేశాడు. దించి వ్రాతలో మునిగి పోయాడు.

ఒరేయ్ కవిగా! పలుకుతావా? ఆ కాగితాలు చింపి పోగెయ్యనా? భాస్కరం కలుగజేసుకున్నాడు.

గంటనుంచీ రూములో పిక్నిక్ ప్రోగ్రామ్‌ను గురించి తన్నుకు ఛస్తున్నామా? రాతరాస్తున్నాడు రాత ...! శంకరం పళ్లు పిండిచేసేశాడు.

భానుమూర్తి కళ్లెత్తి చిరాగ్గా చూచాడు. ఏమిట్రా వెధవగోలా? ప్రశాంతంగా రాసుకోనివ్వరా ఏం?

వెధవగోలట్రా? గంటనుంచి మొత్తుకుంటూంటే ఎద్దు కొమ్ముమీది జోరీగలా వులుకూ పలుకూ లేకుండా ఏమిటా వెధవ కవిత్వం? సుబ్బారావు అరిచాడు.

భానుమూర్తి ఒక్కఉదుటున లేచి నించున్నాడు. కాగితాలు చేతులో పట్టుక ముగ్గురిమధ్యకూ వస్తూ 'ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు చల్లటిమాట విన్నానురా సుబ్బులూ! నా కవిత్వాన్ని విసుక్కోటమేగానీ ఏమిటీ అనడిగినపాపాన పోయూరా

ఏనాడేనా ? వినిపిస్తానుండు ఏమిటో ! భానుమూర్తిలో ఉత్సాహం ఉరకలువేస్తోంది.

బాబూ భానుమూర్తీ ! ఆ చెత్త చదివి మా బుర్ర లెందుకు పాడుచేస్తావ్ ? నువ్వసలు మా చర్చలో పాల్గొన వద్దు...కూర్చొని రాసుకో పో! భాస్కరం చేతులు జోడించాడు భయంగా.

ఒరేయ్ దుర్మార్గుడా! ఉత్సాహాన్ని చంపుతావేరా? మీరు వినకతప్పదు.

సరేనబ్బాయ్ ! ఈసారి వింటాం ! ఇకమీదట రోజుకో చెత్తరచన రాసి, వినిపించటానికి, మీ నాన్న పంపించే డబ్బులో కాస్త ఇచ్చి మరెవర్నైనా కుదుర్చుకో! శంకరం ఖండితంగా చెప్పేశాడు. మిగతా ఇద్దరూ మరి దోవ లేక చతికిలపడ్డారు. భానుమూర్తి గొంతు సవరించుకున్నాడు.

పచ్చని పంటచేలు, ఆకుపచ్చని సిల్కుచీర కట్టుకున్న అందమైన ఆడదానిలా గాలికి మెల్లగా కదులాడుతున్నాయి. గలగలపారే సెలయేరు సుళ్లుతిరుగుతూ మలుపులుతిరిగి ప్రవహిస్తోంది. మెడలో మువ్వలు, గంటలు ఘణఘణలాడుతుంటే ఠీవిగా నడుస్తున్న ఎద్దుల్ని తోలుకుంటూ, బలిష్ఠమైన శరీరాలతో గంభీరంగా వెడుతున్నారు అమాయక రైతుసోదరులు. సహజ సౌందర్యంతో వెలిగిపోతున్న పల్లెపడుచులు, పచ్చి గడ్డిమోపులు నెత్తిన పెట్టుకుని వయ్యారంగా నడుస్తున్నారు.

అరుణసంధ్యలో పల్లె వాతావరణం ప్రశాంతంగా ఉంది గోధూళివేళ...

ఫుల్‌స్టాప్ భానూ! ఫుల్‌స్టాప్! సుబ్బారావు గావు కేక పెట్టాడు.

పూర్తిగా చదవనీండిరా! భానుమూర్తి పరదీనవదనాన్ని లెక్కచెయ్యకుండా, ఒరే భానూ! నువ్వెప్పుడైనా పల్లెటూరు చూచావుట్రా? నీవర్ణనంతా నిజమేనంటావా? అడిగాడు శంకరం.

అదేమిట్రోయ్ అంత ఇన్‌సల్టింగ్‌గా మాట్లాడ్తావ్! నెల్లూరుజిల్లాలో ఓ మారుమూల పల్లెటూళ్ళో పుట్టానోయ్ నేను! రెండుమూడుమార్లు మా అమ్మతో, మా తాతయ్యగారి ఊరికి (పల్లెటూరికి) వెళ్ళానుకూడా! ఎంచక్కా ఉంటుందనీ...కొబ్బరితోటలూ, గున్నమామిడితోటలూ, మోటభావులూ...అంతెందుకు ప్రతి సినిమాలోనూ చూట్టం లేదూ పల్లెటూళ్లు, పల్లెపడుచులూ వారి అమాయ......

ఒరేయ్ ఆపింక! ఆట్టేవాగక! పోనీ సుబ్బా! మనమేదేనా పల్లెటూరికి వేసుకుందాం మనట్రిప్! ఏమంటావురా శంకూ? భాస్కరం అభిప్రాయాలకోసం రూమంతా కలయజూచాడు. అవి చకచక వచ్చేశాయి.

తప్పకుండా! ఖర్చుతక్కువా! ఫలితం అదే! ఆనందం ఎక్కువా! శంకరం చెప్పాడు.

అవునురా! నెల్లూర్లో పుట్టి, మెడ్రాస్‌లో పెరిగి, హైద్రాబాద్‌లో ఎడ్యుకేషన్ వెలగబెట్టి, ఏఢిల్లీలోనో, బొంబాయిలోనో ఉద్యోగాలు ఏడవాల్సిన మనం ఈ సదవకాశాన్ని జారవిడుచుకోకూడదు...సుబ్బారావు చెప్పేశాడు.

అంతేకాదురా! పల్లెటూరు దేశానికి పట్టుగొమ్మరా...అన్నాడెవరో...ఎవరూ?

ఎవరోలే నీలాటి బడుద్ధాయి. అయితే ఏ ఊరురా భానూ? భాస్కరమే అడిగాడు.

నెల్లూరు జిల్లాలో మారుమూల ఓ గ్రామం పేరు చెప్పాడు భానుమూర్తి. మా తాతగారూ వాళ్లు వెనక వుండి వచ్చారు కాబట్టే, మనం ఫలానావాళ్ల ఇలాకా అని తెలియగానే నెత్తి నెక్కించుకుంటారు.....సమస్త రాజభోగాలూ జరుపుతారు. హాయిగా ఈ వారంరోజులూ ప్రశాంతంగా గడపవచ్చు. పల్లెటూరి సుందర దృశ్యాల్ని, భాస్కరం చిత్రాలుగా, నేను రచనలుగా మార్చేస్తాం! ఏమంటావురా భానూ?

ఒరే భానూ! చిన్నరకం కాఫీహోటలేదేనా వుంటుందట్రా అక్కడ? శంకరం హఠాత్తుగా అడిగాడు.

ఉహుఁ! భానుమూర్తి సమాధానం.

కనీసం కాంచనమాల నటించిన బాలనాగమ్మ సినిమా తీస్తూ చినిగిపోయిన టెంటుఅయినా వుందట్రా? భాస్కరం శంక!

ఊహుఁ!

చదువుకోటానికి ఏదైనా పుస్తకాలూగట్రా వుండే లైబ్రరీ? సుబ్బారావు సందేహం.

ఊహుఁ!

తిప్పకాయలా అలా తల తిప్పుతావ్! మరే ముందక్కడ నా బొంద! హాయిగా ఆగ్రాకేసి వెడదాం! తాజ్

మహల్ చూడొచ్చు! శంకరంలో కోపమూ, నిర్ణయమూ ఒక్కసారిగా వచ్చాయి.

ఒరేయ్ కృత్రిమపు పట్నవాసపు తళుకు బెళుకు లేవీ వుండవురా పల్లెటూళ్ళలో. స్వచ్ఛంద నిర్మలత్వం స్వార్థ రాహిత్యం, సేవాతత్పరత, సహజసౌందర్యం ... అమాయకత్వం...

భానుమూర్తి మాటలు పూర్తి కాకముందే మిగతా ముగ్గురూ మేడమెట్లు దిగారు షుమారైన పరుగుతో.

* * * *

నాలుగు రోజుల తర్వాత

ఆరోజు ట్రెయిన్లో థర్డ్ క్లాస్ కంపార్ట్ మెంటులో మిత్ర చతుష్టయం కలిసిపోయారు టాన్ పాలల్లో నీళ్ళలా! నలుగురూ హోల్డాల్స్ సర్ది కూర్చున్నారు. ట్రెయిన్ జోరుగా పోతోంది. భానుమూర్తి తప్ప, మిగతా ముగ్గురికి ఒకేసారి జ్ఞాపకం వచ్చింది, దారుణమైన విషయం! తీరా తమ వెంట వంటవాణ్ణిగానీ, వంటసామగ్రి కానీ తెచ్చుకోలేదని! ఉండబట్టలేక భాస్కరం ఆ ముక్క భానుమూర్తితో అనేశాడు.

భానుమూర్తి నవ్వాడు. గీతోపదేశం చేసే ముందు, అర్జునుణ్ణి చూచి కృష్ణుడలాటినవ్వే నవ్వి ఉంటాడని!

నాయనా భానూ! నే ముందే చెప్పాను పల్లెటూళ్ళను గురించి. అయినా మరొక్కమారు మననం చేస్తాను. పల్లెటూరి వాళ్ళకు అతిథి అభ్యాగతులను సంతృప్తి పరచటమే

జీవితపరమావధి. కాలేజి మానుక రెండేళ్ళు అతిథిగావున్నా, పల్లెత్తుమాట అనరు. అసలు మన భారతదేశానికి అన్నపూర్ణ, రత్నగర్భ. వగైరా పేర్లు వచ్చిందికూడా పల్లెటూళ్ళని బట్టే నట...ఇంకా...ఏదో చెప్పబోతున్న భానుమూర్తిని నివారిస్తూ.

భానుమూర్తీ! బంగారుకొండా! నువ్వు కాస్సేపు విశ్రాంతి తీసుకో! మా జాగా ఖాళీచేసి ఇస్తాం నిద్రపో! అన్నాడు శంకరం. అర్థమైన ప్రయాణీకులూ, ఆరోగ్యంగా వున్నవారూ భళ్ళుభళ్ళున నవ్వారు. కానివారూ, అనారోగ్యపు అర్భకులూ, చిరునవ్వులతో సరిపెట్టారు. భానుమూర్తి అవ మాన భారంతో క్రుంగి, వంగి, మెల్లిగా జారగిలబడి, తిన్నగా కళ్ళు మూసుకుని, నిజంగానే నిద్రలో మునిగి పోయాడు.

స్టేషన్లో ట్రెయిన్ ఆగగానే భాస్కరం, శంకరం, సుబ్బా రావూ దిగి, హోల్డాల్స్ దింపుకున్నారు. మరు నిముషంలోనే ట్రెయిన్ కూత వేసింది. గాభరాగా, గాఢసుషుప్తిలో మునిగి వున్న భానుమూర్తిని ఈడ్చుకువచ్చారు క్రిందికి.

నిద్రమత్తు వదిలించుకోటానికి ప్రయత్నిస్తూ అర్థ నిమీలిత నేత్రాలతో పరిసర ప్రాంతాన్ని వీక్షించాడు భాను మూర్తి. చిన్నస్టేషన్. స్టేషన్ మాస్టరూ, నిల్చుని నిద్రపోతున్న టికెట్ కలెక్టరూ, కొడిగట్టిన గ్లాసుతో, నల్లగామాడి ఉండీ లేదనిపించగల దీపస్థంభం, ఆ తర్వాత విశాల శూన్య ప్రదేశం!

అప్పుడే వచ్చేశామే! ఆశ్చర్యం ప్రకటించాడు భాను మూర్తి.

ఇక ఏ వాహనం మీద మన ప్రయాణం సాగాలో, దారేమిటో చెప్పరా! సుబ్బారావు అడిగాడు.

భానుమూర్తి సచేతనుడై, చూపుడువేలును ఒకదిక్కు-కేసి చూపాడు.

మిగతా ముగ్గురూ ఆ సంజ్ఞకు అర్థాన్నిలా నిర్వచించుకున్నారు. అల్లంతదూరంలో కన్పించే పదార్థం ఓ బస్సు తాలూకు ఆకారమనీ, అందులో ఎక్కి తామిక ప్రయాణం సాగించాలనీ!

ఇంతలో బస్సుబయల్దేర బోతున్నందుకు గుర్తుగా స్టార్టవుతున్న భీభత్సనాదం విని, ఉలిక్కిపడి, నలుగురూ హోల్డాల్స్ నెత్తిన వేసుక పరుగు లంకించుకున్నారు.

బస్సులో నించోటానికి చోటు సంపాదించుకున్న తర్వాత ఇంజనీరింగ్, ఎం. బి. బి. యస్. లాటి కోర్సుల్లో రెకమండేషన్ లేకుండా సీటు సంపాదించుకోవడం, ప్రచారం పిసరంత లేకుండా మంత్రిగా ఎన్నికవడం, ఎక్స్ట్రా వేషం వేసి, రెండో ఛాన్సులోనే హీరోరోలు సంపాదించటం లాటివి మంచినీళ్ళప్రాయ మనిపించాయి ఆ నలుగురికీ!

మళ్ళీ మరొక్కమారు సింహగర్జనచేసి బస్సు ముందుకు సాగింది. బస్సు నేలమీదే వెళ్తోందో, ఆకాశం మీదే ప్రయాణిస్తుందో, లేక దివికీ భువికీ మధ్య ఊగుతోందో కాస్సేపటివరకూ అర్థమే కాలేదు సుబ్బారావుకు.

ఒక్కసారిగా పైకెగిరి తలకొట్టుకుని తిరిగి కాలు బస్సులో ఆన్చి, విసుగ్గా చుట్టూ చూచి, ప్రయాణీకు లందరూ తనస్థితిలోనే వున్నారని తెలుసుకుని స్థిమితపడ్డాడు భాస్కరం.

ఒరే భానూ! పి. డబ్ల్యు. డి. వాళ్లీ రోడ్డును చూళ్ళేదా ? అన్నాడు అమాయకంగా శంకరం !

రోజూ చూస్తూనే వుంటారు ! భానుమూర్తి నిర్వేద మయిన జవాబు.

మరి ?

అదంతేలే! పక్కనున్న కమ్మీకి ఫెడేల్‌మని కొట్టుకున్న భానుమూర్తికి ఎక్కడలేని చిరాకూ శంకరంమీద కలిగింది.

అక్కడక్కడా ఆగుతూ, జనాన్ని పట్టిస్తూ, పేర్చుతూ, సూర్యాస్తమయ సమయానికి చుట్టూ చిన్న అడవిలా కన్పిస్తున్న ప్రాంతంలో ఆగింది బస్సు.

మనం ఇక్కడే దిగాలి! అన్నాడు భానుమూర్తి.

ముగ్గురూ ఎగిరి దూకారా మాట వినగానే. బస్సు కదిలిపోయింది దుమ్ము రేపుకుంటూ.

సినిమాలో చూచిన, గజ్జెల మువ్వల గలగలలతో బిర బిర పరుగెత్తే మైసూరుగిత్తల బండికోసం చుట్టూ కలయ జూశాడు శంకరం. బండిగానుల ఆనవాలు కూడా ఎక్కడా కనిపించక పోవటంతో ఉస్సురని కూలబడ్డాడు.

అస్తమిస్తున్న సూర్యుడి అందాన్ని తిలకిస్తున్నాడు భానుమూర్తి.

చూచారుట్రా? ఆ చెట్లమీదుగా వస్తున్న ఎర్రని కాంతి! అదో, నేల కూడా ఎర్రగా కుంకుమ జల్లినట్లు...

ఏడ్చావ్! వేధవ్వర్ణనా నువ్వూ! ఇక ఎలావెళ్లాలో చెప్పు! ఈ అడవిలో తోసి, ప్రకృతిని వర్ణిస్తున్నావా! బాధా, భయమూ, నిస్సహాయతా సమ్మిశ్రితమై సుబ్బారావు కంఠం గాద్గదికమయిపోయిందొక్కసారిగా!

ఒరేయ్! దయ్యాలుంటాయి కాబోలు...భాస్కరం చుట్టూరా చూస్తూ బిత్తరపోయాడు.

భానుమూర్తి దారి తీశాడు. ముగ్గురూ మనసులో దీవిస్తూ మౌనంగా అనుసరించారు.

రాత్రి ఎనిమిది గంటలు కావస్తుంది. పల్లెటూరంతా మాటుమణిగి వుంది! ఎక్కడా సవ్వడిలేదు. అంతా నిద్రలో మునిగి వున్నారు. ఊళ్ళోకి వచ్చారు నలుగురూ.

ఒరేయ్ నీళ్ళు! శంకరం కీచుమని అరిచాడు కాలు పైకి లాక్కోవటానికి ప్రయత్నిస్తూ.

నడివీధిలో నీళ్ళు! ఆశ్చర్యం ప్రకటించాడు సుబ్బారావు.

మరిక్కడ మనుషులు బోట్లలో పోతారు కాబోలు! భాస్కరం అమూల్యాభిప్రాయం.

ఏడ్చినట్లుంది తెలివి! యింకానయం, ఈదుతూ పోతారనలేదు. బాగా, రాజాల్లా ఇలా నడిచిపోతారు! పాంటు పైకి మడుచుకొని, హోల్డాల్ మరికాస్త ఎత్తుగా పట్టుకొని నీళ్లలో దిగాడు భానుమూర్తి.

అయినా ఇలా వీధుల్లో మురికినీళ్ళు ప్రవహిస్తున్నాయే మిత్రా? జనం ఎలా బ్రతుకుతున్నారు? ఆరోగ్యం దెబ్బ తినదూ? డ్రైనేజ్ సిస్టమ్ లేదూ? బ్లాక్ డెవలప్‌మెంటు స్కీములన్నీ ఎందుకూ? తగలెయ్యనా? ఈ పంచాయితీ బోర్డు ప్రెశిడెంటు నిద్రపోతున్నాడా? సమితి ప్రెసిడెంటు చచ్చిపోయాడా? శంకరం వాగ్ధోరణి ఆపటం మంచిదని పించింది భానుమూర్తికి.

తమ్ముడూ శంకూ! ఇది పల్లెటూరు. ప్రెశిడెంటుకు అటు ఏడు తరాలవారుగానీ, ఇటు ఏడు తరాలవారుగానీ, ఎవ్వరూ 'అ ఆ'లు పలక లేదు. పలకబోరు. జనం మనలాటి సున్నిత శరీర, మనస్తత్వాలు గలవారు కారు కాబట్టి బాగా రాళ్ళలా వున్నారు...ఇక బ్లాక్ డెవలప్‌మెంటు వాళ్ళ సంగతంటావా? వి. యల్. డబ్ల్యు. లూ, గ్రామసేవికలూ, సేవకులూ అంతా రికార్డులోనే ఇలాటి గ్రామాలకు వెళ్ళివచ్చినట్లు, సమితి సెంటర్ లోనే కూర్చుని వ్రాసుకుంటారుట...సమితి ప్రెశిడెంటు, సమితి తర్వాత తానెలా జిల్లాపరిషత్తు చైర్మన్ కావాలా? అని ఆలోచిస్తుంటాడు కాబట్టి ఇలాటి చిన్న చిన్న విషయాలను పట్టించుకోడు...యిక ప్రజలంటావా? పుష్కలంగా డబ్బు లెవరిస్తే వాళ్ళకి ఓట్లు...

భానుమూర్తి వాగుడు ఆపటమెలా అనే సమస్య సుబ్బారావునీ భాస్కరాన్నీ పీడించివేస్తుంది. దారి తెలియటం లేదు. గాఢాంధకారం. క్రింద మురికినీళ్లు. వీళ్లిద్దరి సంవాదం! దోమల సంగీతం, కడుపులో ఆకలి!

ఒరేయ్! భానూ! శంకరం! మీ యిద్దరికీ, ఏదేనా పంచకిందికి చేరాక వెయ్యి నమస్కారాలు పెడతాను. నోళ్లు మూసుకుని దారి చూడండిరా! దీనంగా వేడుకున్నాడు భాస్కరం.

అదుగో! అది కరణంగారిల్లు! నాకు బాగా గుర్తు రోయ్! అక్కడే ఆ కరణంగారి అబ్బాయితో ఆడుకునే వాణ్ణి నేను...అవును అదే అదే...భానుమూర్తి ఆనంద తాండవం చేశాడు.

అందరికీ ప్రాణాలు లేచివచ్చాయి.

భానుమూర్తే పిలుపుకు పడిగట్టాడు.

కరణంగారూ! కరణంగారూ!

షుమారు అరగంట కేకలు వేసింతర్వాత, ఊళ్ళో అర వంద జనం నిద్ర మేల్కొన్నపిమ్మట, కరణంగారనబడే లావుపాటి శాస్త్రి భళ్ళున తలుపుతీసుక బయటికి వచ్చింది.

ఈ జామునే గాడిద...లురా! నిద్ర చెడగొట్టారూ? అన్నాడు తాపీగా సాధ్యమైనంత గ్రామ్యంలో సంబోధన చేస్తూ!

భానుమూర్తి తన వంశవృక్షం తిరగేశి, తాము పల్లె ప్రాంతాన్నీ, అక్కడి ప్రకృతి అందాన్నీ చూచి ఆనందిద్దామని వచ్చినట్లూ, విశదీకరించాడు. పనిలోపని భోజనం సైతం కూడా తెలిపాడు.

హూం! అని హూంకరించి మూలగావున్న ఆసనం వేపు చూపి లోపలికెళ్ళాడు కరణంగారు!

పిడుగుపడ్డట్టుగా, కాళికాదేవి కోపస్వరంలా 'ఈ పూటకు తిండి పడేస్తాను...అదయినా ఎట్టాగో మిగిలింది కాబట్టి...రేపట్నుంచి ఎక్కడేనా ఛావమను!' అనే సింహనాదం, పల్లెపడుచు అమాయక కంఠస్వరం విన్పించింది కంచు గంటలా! మలేరియా రోగిలా, గజగజవణుకుతూ బయటికి వచ్చిన కరణంగారు, వేలెట్టి నుయ్యి చూపించారు.

అందులో దూకమంటాడేమిటీ? అన్నాడు భయంగా భాస్కరం భానుమూర్తి చెవిలో!

ఛస్! కాళ్ళు చేతులూ కడుక్కోమంటున్నాడు! అర్థం వివరించాడు. భానుమూర్తి.

ఓహోఁ!

చింతకాయపచ్చడీ, నీళ్లమజ్జిగతో అవియల్, పులిహోర స్పెషల్ భోజనం చేసినట్లుగా తృప్తిపడ్డారు నలుగురూ.

బుడ్డిదీపం వెలిగించుక వచ్చాడు కరణంగారు. ఒరేయ్! పోలాయ్! ఆ బర్రెదూడల్ని మూలగాకట్టేసి, కొట్టం కాస్త శుభ్భరం చెయ్యరా! ఈ బస్తీపిల్లలు పడుంటారు అని ఆజ్ఞ జారీ చేశాడు.

రేపయినా మనగతేమిటో? అన్నాడు భాస్కరం భోరున ఏడవ్వాలనిపిస్తున్నా, మింగుకుంటూ!

నేను కరణంగారితో మాట్లాడాను లెండర్రా! ఈ రోజంటే హఠాత్తుగా మనంరావటం, అందులోనూ వాళ్ల

ఆడాళ్లకి వంట్లో కులాసాగా లేదట, రేపు మనకోసం చక్కటి బస ఏర్పాటు చేయిస్తాడట...

నిజంగా ? శంకరం నమ్మలేక పోతున్నాడు !

నిజమేరా ! మీ రనుకునేంతటి సంకుచిత స్వభావులు కాదు పల్లెటూరి ప్రజలు ! స్వచ్ఛంద సేవాపరాయణత్వం వారి సొత్తు. నిర్మల స్వభావం...

ఒరేయ్ భానూ ! మమ్మల్ని నిద్రపోనియ్యవా ? ఈ కీకారణ్యంలోకి లాక్కొచ్చి, అందులోనూ గొడ్ల సావిట్లో, ఈ దోమల సంగీతం, పేడ వాసనలు చాలక నీ గోలొకటా ?

సుబ్బారావు చిరచిరలతో బాటు దుప్పటి ముఖంమీదికి లాక్కున్నాడు.

అలసిపోయిన ఆ నలుగురూ క్షణంలో ఆదమరచి నిద్ర పోయారు.

*　　*　　*　　*

మర్నాడు.

పోలాయ్ నలుగురినీ వెంటబెట్టుక వెళ్ళి, బస చూపించి వెళ్ళిపోయాడు. ఊరిబయట, గ్రామదేవత గుడికి కాస్త దూరంలో ఓ తాటాకు గుడిసె అది. పూర్వం ఇంగ్లీషువారి పరిపాలనా కాలంలో గ్రామదేవత జాతరకుగానూ ఇతర గ్రామాలనుండి వచ్చే యాత్రికుల వసతిగృహం తాలూకు ఒక గదిలోని మిగిలిన భాగమది !

సుబ్బారావు చుట్టూ కలయ చూశాడు.

ప్రాచీన భారతీయుల స్మారక చిహ్నాలుగా పొయ్యి రాళ్లు కాబోలు నిండా పడి వున్నాయి. పది పన్నెండు ఎండిన తాటాకులు, సత్యమాధారంగా పుచ్చిపోయిన ఒకేఒక స్తంభం మీద అంటిపెట్టుకుని వున్నాయి! గజమున్నర ఎత్తుగా మట్టి పేరుకుని వుంది. క్రింద గోడలకు చుట్టూరా అంగుళం మందాన మసిబట్టివుంది.

శంకరం బుర్రలో తళుక్కున మెరుపులాటి ఆలోచన రింగులు తిరిగింది సినిమా రీలులా!

చిన్నప్పుడు తనకు బాగా గుర్తు. దీపారాధన చేసి, కొడిగట్టించి, పళ్లేనికి అంటిన మసి అంతా పోగుచేసి కాటుక తయారుచేసేది అమ్మ. ఓ డిగ్రీ పుచ్చుక తనూ, కొందరు మనుషుల్ని కుదుర్చుక, ఈ మసి అంతా కాటుకగా తయారు చేయించి బిజినెస్ మొదలుపెట్టొచ్చు. చింతాకంత కళ్ల చిన్న దాన్ని చిత్రించి చూపి, ఈ కాటుకవల్ల ఆమెకళ్లు మర్రాకు లంతగా మారినట్లు అడ్వర్‌టైజ్ చేస్తే మనదేశంలో నేమిటి, విదేశాల్లోకూడా నిర్విఘ్నంగా సాగుతుంది వ్యాపారం! పాలుతాగే పసిపాపయినా అందానికి మెరుగులు దిద్దుతా మంటే 'ఊ!' అంటుంది. ఇక యువతులు ఊహూః! అంటారా? ఓహ్ డబ్బు లక్షలు! కోట్లు!

భానుమూర్తి ముగ్గురికేసి చూశాడు. సుబ్బారావు దిగాలుపడి చూస్తున్నాడు. భాస్కరంగాడు అయోమయపు పోజ్ వేశాడు. శంకర మేదో ఊహాలోకాల్లో విహరిస్తు న్నాడు. జిడ్డి వెధవలు! తనొక్కడే ఇదంతా శుభ్రం

చెయ్యాలని కాబోలు వీళ్ళ ఉద్దేశ్యం! భానుమూర్తిలో
ఉక్రోషం వెల్లుబికింది!

ఒరేయ్! మీ ఆలోచనలు తగలెయ్య! కాస్త
ఈ ఇల్లు శుభ్రం చేద్దాంరాండ్రా! అంటూ అరిచాడు.

వెధవ! వెధవసలహా నువ్వూను! ఇంతదూరం
లాక్కొచ్చి నానా గడ్డీ పెడ్తున్నావ్! శంకరం ఇక ఆపుకో
లేకపోతున్నాడు.

చిటుక్కుమంటే నామీద విరుచుకు పడ్తారేమిట్రా?
మీరే కాదూ? నామానాన నేను రాసుకుంటూంటే, అదే
మిటి? అనడిగారు. అంతటితో ఆగక మీ మధ్యకు లాక్కొ
చ్చారు. పల్లెటూళ్ళు చూడాలి, అంటూ తీర్మానం చేశారు...
భానుమూర్తి శివతాండవాని కుపక్రమించాడు.

సూక్ష్మగ్రాహి సుబ్బారావు, పరిస్థితి ఇట్టే పసికట్టాడు.
భానుమూర్తి ఆపులేకుండ ఇక మంచినీళ్లు కూడా దొరికే
దారి లేదిక్కడ!

మరేదో పేలబోతున్న శంకరాన్ని ఆపుతూ ఈ ఊళ్ళో
ఖూనీలు చేసుకుంటారుట్రా? శవాల ఆచూకి కూడా బయటి
ప్రపంచానికి తెలియదు! అంత కోరికగా వుంటే ఆ బండలతో
బుర్రలు బద్దలు కొట్టుకోండి. కొన్నయినా బయటికి చేరు
తాయి, అన్నారు చెయ్యవలసిన కార్యక్రమానికి సూచనగా!

అరగంటలో బండలన్నీ బయటపడ్డాయి. తాటాకులు
రెండు చూరులోనుంచి పీకి చీపుర్లుగా తయారుచేసి, సుబ్బా
రావూ, భాస్కరమూ ఓ మూల రాశిగాచేశారు మట్టి

అంతా. పాంట్ నోదాన్ని తీసుకు రెండుకాళ్లకూ అడుగున ముళ్లువేసి గోతంలా తయారుచేసి, అందులో మట్టి ఎత్తి పోసే పని శంకరం భానుమూర్తుల వంతయింది.

ఇల్లు కాస్త శుభ్రపడింది! కానీ గంట తొమ్మిది కావొస్తోంది! కాఫీ ఆశకూడా కనిపించటంలేదు. కరణం గారు కాఫీ పంపిస్తాడని వున్న ఆలోచన మాయమయ్యింది!

ఒరేయ్! ఎంచేతో కాఫీ ఎవ్వరూ తేలేదు. నేవెళ్ళి కరణంగారిని కనుక్కునివస్తాను. భోజనం ఎక్కడ ఏర్పాటు చేశాడో...అసలు లేనేలేదో? భానుమూర్తి ఉస్సురంటూ బయల్దేరాడు. నాన్నా భానూ! పగటివేషంలా వున్నావు తండ్రీ! మట్టీమసీ పూసుకుని! అన్నాడు శంకరం.

'నువ్వుమాత్రం?' వెక్కిరించాడు భాస్కరం.

'మరి మీరో?'

'అంతా అల్లాగేవున్నాం నాయనా! ఈ ప్రాంతంలో ఎక్కడేనా నీళ్ళచుక్క! అదిగో...చుక్కలాటి అమ్మాయి వస్తోందినెత్తిన కడవతో. అడుగుదామా?' భాస్కరం గుటకలు మింగాడు. పల్లెపడుచు దగ్గరగా వచ్చింది. ఝుడుసుకున్నాడు సుబ్బారావు. చింపిరిజుట్టూ, పిల్లికళ్లూ, ముతక బట్టలూ, కడవరంగు శరీరఛాయ, పురుషుడి కుండవలసిన బలిష్ఠ శరీరం! రామరామ! అమాయక పల్లెపడుచు సహజ సౌందర్యం! భానుమూర్తిని మింగేలా చూచాడు.

'అమ్మడూ! దూరంపోలేం! కాసిన్నీళ్లు మాకిస్తావా? చేతులు శుభ్రంచేసుకుంటాం?' ప్రాధేయపడ్డాడు శంకరం.

'ఓ! రాత్రి ఊళ్లోకొచ్చిన బస్తీపిల్లోళ్లా మీరు? అమ్మడూ గిమ్మడూ అంటే పళ్లురాల్తాయి పిల్లోడా! ఇంద నీళ్లు!' తలకాసిన్నిపోసి, భూమి బద్దలయ్యేలా నడుస్తూ వెళ్ళిందామె! క్షణకాలం నలుగురూ మూర్ఛపోయి తేరుకున్నారు. ఊళ్లోకివెళ్ళిన భానుమూర్తి గంటన్నర తర్వాత, మహానందంతో చెంబెడు గొర్రెపాలతో తిరిగివచ్చాడు.

'రోజుకు వండిపెట్టినందుకు రూపాయీ, మనిషికొక్కరికి భోజనానికి ముప్పావలా వంతున ఇచ్చేట్లూ, ఒకామెను కుదిర్చాడు కరణంగారు వంటకు. అడ్వాన్సు ఈ రోజుకు రేపటికి ముందే ఇమ్మన్నాడు. ఇచ్చివచ్చాను.'...అన్నాడు రోజుతూ!

'పోన్లే చల్లనితల్లి! ఆమాత్రం వండిపెడ్తే అంతే చాలు!'' అంటున్న శంకరం చెంబులోకి చూచి 'ఇదేమిట్రా!' అంటూ గావుకేక పెట్టాడు.

'అదా! అది గొర్రెబొచ్చులే! హేండ్ కర్చిఫ్ ఒకటి తీసి వడకట్టి తాగుదాం లేండిరా! మన బస్తీల్లో ఇల్లాగేగా, పాలు రకరకాలుకలిపి బర్రెపాలగా, ఆవుపాలగా, కాఫీగా, టీగా అమ్మేస్తారూ, మనం తాగుతాం!' అన్నాడు భానుమూర్తి!

అప్పటికాస్త ప్రాణాలు నిలిచాయి గొర్రెపాలతో!

పన్నెండుగంటల ప్రాంతంలో, తోటకూర పులుసుకూర, కేసరిబియ్యపు అన్నం, పెరుగనబడే మజ్జిగతో విందు పూర్తయింది.

సాయంత్రం.

'ఇక యిప్పుడు పల్లెటూరి వింతలూ విశేషాలూ చూద్దామా ?' అన్నాడు సుబ్బారావు.

'వింత లేమిట్రా నీ మొహం. ప్రకృతి సౌందర్యం తిలకిద్దాం అను.' సవరించాడు భానుమూర్తి.

'రాత్రినుంచి తిలకిస్తున్నాంగా ? అక్కసు' వెళ్ళబోసుకున్నాడు శంకరం.

'ఏదో ఒకటి కానీండ్రా.' పంచశీల కాస్సేపు మననం చేసుకున్నాడు భాస్కరం రెండో బూటు ముడి వేసుకుంటూ.

నిండు పైర్లలోకీ, పంటకాలవ గట్లమీదకూ వెళ్తూ బూట్లు తొడుక్కుంటారుట్రా ఎవరేనా ? భానుమూర్తి హేళనతో 'కాబోలు' అనుకొని బూట్లు విప్పేశాయి మిగతా గ్రహాలు రెండూకూడా !

భానుమూర్తి త్రోవతీశాడు. మిగతావాళ్లు తన్ననుసరించారు. మైలుకుపైగా ఎటునడిచినా, పచ్చగడ్డిమొక్క కనిపించలేదు. కనుచూపుమేరలో అంతా ఎండి బీటలువారిన భూమి, కొయ్య కాళ్లూ !

'ప్చ్! ఇది సీజను కాదురా. అంతా కోతలయిపోయాయి.' భానుమూర్తి నిట్టూర్చాడు.

సర్రున చీల్చుకుంది శంకరం కాలు - కొయ్యకాలు తగిలి.

'తొడుక్కున్న బూట్లు విప్పమంటివి గదరా !' మండిపడ్డాడు శంకరం.

'బూట్లు విప్పమన్నాను గానీ కళ్ళు నెత్తిన పెట్టుక నడవ మన్నానా ?' ఎదురుతిరిగాడు భానుమూర్తి.

చెరువుగట్టు దగ్గరికి వచ్చేశారు.

'నాన్నా భానూ! అబ్బాయ్ సుబ్బులూ! తండ్రీ శంకరూ! కింద చూడండిరా! పురజనులీ చెరువుగట్టును లెట్రిన్ గా ఉపయోగించుకున్నారురా!' భాస్కరం వెలిబుచ్చిన నగ్నసత్యాన్ని పరికించి ఒక్కసారిగా 'రైట్ అబౌట్ టర్న్ మార్చ్' అనేశారందరూ! పిక్ నిక్ ను చాలిద్దామనుకున్నారు.

నిమిషాలమీద తాటాకులగదికి చేరి - సామాను సర్దుకొని చీకటి పడేలోపల స్టేషన్ కు చేరారు. సమయానికి బండి వచ్చింది. అందరూ ఎక్కారు, ట్రెయిన్ కదిలింది. శంకరం తలలో తాజ్ మహల్ మెదిలి, కళ్లుమూసుకున్నాడు బాధగా.

భాస్కరం, సుబ్బారావులు, తాటాకులు ఒరుసుకుని కదుములు గట్టిన చేతులూ, బోదకాళ్ల ను మరిపిస్తున్న కాళ్లనూ చూచుకొని గట్టిగా నిట్టూర్చారు.

ట్రెయిన్ ఊపుకూ, గాలిజోరుకూ, ఎగురుతున్న కాగితాలను అదుపులో పెట్టుకుంటూ భానుమూర్తి వ్రాస్తున్నాడు.

'పచ్చని పంటచేలు ఆకుపచ్చని సిల్కుచీరె కట్టుకున్న అందమయిన అమ్మాయిలా గాలికి మెల్లిగా కదులుతున్నాయి. జలజలపారే సెలయేరూ, ఏపుగా పెరిగిన జొన్నచేలూ, ఒయ్యారంగా వెడ్తున్న పల్లెపడుచులూ, అమాయక నిర్మల రైతు సోదరులు, అరుణసంధ్యలో తళతళలాడ్తున్న చెరువులోని నీరూ, ఓహ్! అద్భుతమయిన దృశ్యం...!'